నమస్తే తెలంగాణ
# జనగామ
3 | వరంగల్, సోమవారం 7 అక్టోబర్ 2024 | JANAGAON



మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు



కాళేశ్వరం : కూష్మాండ అలంకరణలో పార్వతి అమ్మవారు

# మహాలక్ష్మిగా భద్రకాళీ

**నాలుగో రోజుకు శరన్నవరాత్రి ఉత్సవాలు**

వరంగల్,అక్టోబర్ 6 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం భద్రకాళీ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభ, సాయంత్రం హంస వాహనంపై ఊరేగారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**కూష్మాండ అలంకరణలో అమ్మవారు**

కాళేశ్వరం : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలోని శ్రీ పార్వతి, మహా సరస్వతి అమ్మవార్లు ఆదివారం కూష్మాండ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ మేరకు ఉదయం గణపతి, లలితార్చన పూజలతో పాటు గణపతి, నవగ్రహ, రుద్ర పంచసూక్త హోమం, సాయంత్రం మూలమంత్ర చండీహోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## శాకంబరీపై ధరల ప్రభావం

- అమ్మవారి అలంకరణకు భారంగా మారిన కూరగాయలు
- ఆకు కూరలతో సరిపెట్టుకున్న నిర్వాహకులు

ఏటూరునాగారం, అక్టోబర్ 6: పెరిగిన కూరగాయల ధరల ప్రభావం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలపై పడింది. మార్కెట్‌లో కేజీ టమాట రూ. 100, ఇతర కూరగాయలు రూ. 160 వరకు ఉండడంతో దుర్గామాతను కూరగాయలతో అలంకరించడం భారంగా మారింది. దీంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఎక్కువశాతం ఆకు కూరలు, తక్కువ కూరగాయలు వినియోగించి దుర్గామాతకు శాకంబరీ అలంకరణ చేశారు నిర్వాహకులు.



ఆకుకూరల అలంకరణలో దుర్గామాత

# ఎత్తిపోయని మోరంచ!

## లిఫ్ట్ మరమ్మతును పట్టించుకోని పాలకులు

**గత ఏడాది వరదలకు మోరంచవాగు ఉప్పొంగింది. దీంతో మోరంచపల్లి గ్రామం నీట మునిగి ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ఈ క్రమంలోనే వాగుపై ఉన్న మోరంచ ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్) పనికిరాకుండా పోయింది. ఫలితంగా ఈ ప్రాజెక్ట్ పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న 220 మంది రైతుల పొలాలకు నీరందని పరిస్థితి నెలకొంది. గత వానకాలం, యాసంగి పంటలు కోల్పోయిన అన్నదాతలకు ఈసారీ చుక్కెదురైంది. చెడిపోయిన మోటర్లు, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి నీటిని ఎత్తి పోస్తారనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం నీరు లేక, రాక పంటలు వేయకపోవడంతో భూములన్నీ బీళ్లుగా మారాయి. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారులు ప్రాజెక్ట్ వైపు కన్నెత్తి చూడకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ లిఫ్ట్ పైనే ఆధారపడిన తమకు దిక్కెవరంటూ ఆందోళన చెందుతున్నారు.**

*- జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ)*



మోరంచపల్లిలోని ఎత్తిపోతల ప్రాజెక్టు



సాగు చేయకపోవడంతో బీడుగా మారిన పంట పొలాలు

- మూడో పంటనూ కోల్పోయిన రైతులు
- వరదలతో కొట్టుకుపోయిన ఎత్తిపోతల ప్రాజెక్ట్
- దానిపైనే ఆధారపడిన 220 మంది రైతులు
- నీళ్లు లేక వానకాలం పంటలు వేయని అన్నదాతలు
- బీడుగా మారిన 600 ఎకరాలు

మోరంచ ఎత్తిపోతల పథకాన్ని 1970లో నిర్మించగా అప్పుడు 1260 ఎకరాల ఆయకట్టుగా నిర్ధారించారు. క్రమంగా ఆయకట్టు తగ్గుతూ వస్తున్నప్పటికీ మోరంచపల్లి పరిసర గ్రామాలకు చెందిన 220 మంది రైతులు దీనిపైనే ఆధారపడి పంటలు పండించుకుంటారు. ఈ ప్రాజెక్ట్ నీట మునగడంతో గత వానకాలం, యాసంగిలో దీని కింద 600 ఎకరాల్లో పంటలు వేయలేదు. రెండు సీజన్లలో కలిపి దాదాపు రూ. 30 కోట్ల వరకు పంటను రైతులు నష్టపోయారు. ఈ వానకాలంలో సైతం నీళ్లు ఎత్తిపోయకపోవడంతో రైతులు తమ భూములను బీళ్లుగా వదిలేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడూ లిఫ్ట్‌కు ఇబ్బందులు ఎదురుకాలేదని, రెండు పంటలు సాగుచేసుకున్నామని వారు చెప్పుతున్నారు.

**ఇప్పటికీ మరమ్మతులు కరువు**

మోరంచవాగు ఉప్పొంగడంతో గత ఏడాది జూలైలో భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామం నీటమునిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మోరంచ ఎత్తిపోతల ప్రాజెక్టు సైతం వరద ప్రభావానికి గురైంది. కాలువలో ఉన్న ఎత్తిపోతల బావి కోతకు గురికాగా, మోటర్లు నీట మునిగి ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు కొట్టుకుపోయాయి. ఈ ప్రాజెక్టుకు వెళ్లే దారి కూడా పూర్తిగా ధ్వంసమైంది. ఎత్తిపోతల కాలువలకు గండ్లు పడ్డాయి. అయితే లిఫ్ట్‌కు మరమ్మతు చేయాల్సిన అధికారులు ఇప్పటి వరకు అటువైపు కన్నెత్తి చూడలేదు. కనీసం లిఫ్ట్ షట్టర్ కూడా తెరవలేదు. రెండు పంటలు కోల్పోయినా, మూడో పంటకు నీరందుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. రూ. 15 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వారంలో నిధులు మంజూరవుతాయని, వెంటనే పనులు ప్రారంభించి వానకాలంలో నీరందిస్తామని టీఎస్ఐడీసీ డీఈ రాజయ్య మూడు నెలల క్రితమే ప్రకటించినప్పటికీ పనుల్లో పురోగతి లేదు.

### ఈ పంటకూ నీళ్లు లేవు



గత ఏడాది జూలైలో వచ్చిన వరదలకు మోరంచపల్లి గ్రామంతో పాటు ఎత్తిపోతల పథకం మోటర్లు నీట మునిగాయి. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు సైతం కొట్టుకుపోయింది. దాని మరమ్మతులను అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. దీంతో గత వానకాలం, యాసంగికి నీళ్లు లేక పంటలు వేసుకోలేదు. ఇప్పుడు కూడా పంటలు వదిలేసినం. కేవలం లిఫ్ట్ పైనే ఆధారపడి 600 ఎకరాలు సాగు చేసుకుంటున్నం. వానకాలంలో నీళ్లిస్తమని డీఈ చెప్పిండు. ఇప్పటికీ అతీగతీ లేదు.

– గాదం సదానందం, మోరంచ ఎత్తిపోతల ప్రాజెక్టు చైర్మన్

### అప్పుల పాలవుతున్నాం..



వరదలతో లిఫ్ట్ దెబ్బతిన్నది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రెండు పంటలు కోల్పోయాం. ఇప్పుడు కూడా నీళ్లు అందించక మూడో పంటనూ వదులుకున్నం. కేవలం లిఫ్ట్‌పైనే ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నం. పంటలు లేక అప్పుల పాలవుతున్నాం.

– దాసరి రవి, మాజీ సర్పంచ్, మోరంచపల్లి

# ఉల్లి.. దిగి రావే తల్లి



- *అమాంతం పెరిగిన ధరలు*
- సైజును బట్టి ధర.., కిలోకు రూ.55 నుంచి రూ.70 వరకు..
- పండుగ పూట పేద, మధ్యతరగతి ప్రజల పరేషాన్
- అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గడమే కారణం
- సబ్సిడీపై ప్రభుత్వం విక్రయించాలని ప్రజల డిమాండ్

మహబూబాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ) : పండుగ పూట ఉల్లి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. మూడు నెలల క్రితం వరకు రూ.20కి కిలో లభించిన ఉల్లిగడ్డల ధరలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలోకు రూ.70కి చేరడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తినలేని పరిస్థితి నెలకొన్నది. ఇందులో సైజును బట్టి రేటు ఉన్నది. చిన్న సైజు అయితే రూ.55, మీడియం అయితే రూ.65, పెద్ద గడ్డ అయితే రూ. 70కి కిలో చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. కూరగాయలు, వంట నూనెలు, అల్లం వెల్లుల్లి ధరలు పెరిగి ఓ వైపు ప్రజలు ఇబ్బంది పడుతుండగా, ఇప్పుడు ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతుండడంతో కొందరు వాటిని కొనడమే మానేశారు. మరికొందరు వాటిపై పెట్టే ఖర్చును సగానికి తగ్గించుకుంటున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఉల్లిగడ్డ మహారాష్ట్ర నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఉల్లి పంట బాగా దెబ్బతిన్నది. దీంతో జిల్లాకు ఉల్లి దిగుమతి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లిగడ్డల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై అందించేంది. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం ఆ ప్రయత్నాలు చేయడం లేదు. బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఉల్లిగడ్డల ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఉల్లి ధరలు ఆకాశాన్నంటినా కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై అందించేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



| ఉల్లి ధరలు (కిలోకు) | కొత్తది | పాతది |
|---|---|---|
| చిన్న రకం | 45 | 55 |
| మీడియం రకం | 55 | 65 |
| పెద్ద రకం | 60 | 70 |

# నాటి వైభవమేది?

*బతుకమ్మను చిన్నచూపు చూస్తున్న రేవంత్ ప్రభుత్వం*

- కానరాని కానుకలు.. అందని డబ్బులు
- గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆడంబరంగా ఉత్సవాలు
- నేడు కనీస ఏర్పాట్లు లేక డీలాపడుతున్న మహిళలు
- కాంగ్రెస్ సర్కారుపై అసంతృప్తిలో ఆడపడుచులు



పరకాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)



పరకాల, అక్టోబర్ 6 : తెలంగాణ ఆడపడుచులకు అతి పెద్దదైన బతకమ్మ పండుగలో ప్రస్తుతం నాటి వైభవం కనిపించడం లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పూర్వస్థితిని సంతరించుకున్న పూల పండుగ నేడు అస్థిత్వం కోసం పోరాడాల్సి వస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించిన వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడే వారు. ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం బతుకమ్మ వేడుకలపై చిన్నచూపు చూస్తున్నది. ఆడబిడ్డలు ఆడుకోవడానికి కనీస ఏర్పాట్లు కూడా చేయని దుస్థితి నెలకొంది. బతుకమ్మ కానుకలు రాక.. ఇస్తామన్న రూ. 500 ఇవ్వక మహిళలు డీలా పడిపోతున్నారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో సంబురంగా బతుకమ్మ ఆడుకునే పరిస్థితి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కేసీఆర్ ప్రభుత్వంలో అధికారికంగా..**

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కేసీఆర్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఊరూరా ఉత్సవాలను ఘనంగా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామంలో వీధిలైట్ల ఏర్పాటుతో పాటు బతుకమ్మ ఆడే, నిమజ్జనం చేసే ప్రాంతాన్ని చదును చేసి విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆడబిడ్డల ఆటపాటలతో సందడిగా మారేది.

**ప్రస్తుతం కానరాని ఏర్పాట్లు**

బతుకమ్మ పండుగ ప్రారంభమైన నాటి నుంచే గ్రామాల్లో వాడవాడలా సందడితో ఉండాల్సిన పల్లెలు నేడు వెలవెల బోతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా జరుగుతున్న బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తారని ఆశపడ్డ మహిళలకు అడియాసే మిగిలింది. గ్రామాల్లో బతుకమ్మ ఆట స్థలాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ పండుగకు వారం రోజుల ముందు నుంచే ఏర్పాట్లు జరిగిన నేపథ్యం నుంచి మూడు రోజుల ముందే హడావుడి చేసే దుస్థితికి దిగజారింది.

**నిమజ్జన ప్రాంతాలు అస్తవ్యస్తం**

సద్దుల బతుకమ్మ ఆడే, నిమజ్జనం చేసే ప్రాంతాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొన్నిచోట్ల స్థలాన్ని చదును చేయకపోవడంతో పాటు విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేయలేదు. మరికొన్ని ప్రాంతాల్లో ఈ ఏర్పాట్లు చేసినా నిమజ్జనానికి మహిళలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. పరకాల పట్టణంలోని మహిళలు పశువుల సంతలో బతుకమ్మ ఆడుకొని పక్కనే ఉన్న దామెర చెరువులో నిమజ్జనం చేస్తారు. అయితే సంతలో కేవలం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దామెర చెరువు ఘాట్ వద్ద మరికొన్ని మెట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసినా నిమజ్జనానికి ఇబ్బందిగా ఉన్నాయి. అవి అలాగే చెరువులోని పిచ్చి చెట్లను తొలగించలేదు.

### బతుకమ్మ కానుకలేవి..



బతుకమ్మ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. అంటే మహిళలను అవమానపరిచినట్లే. కేసీఆర్ ప్రభుత్వం ఏటా కానుకలను అందించి మహిళలను గుర్తించింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఇప్పటి వరకు ఎలాంటి కానుకలు అందించలేదు. ఈ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు ఆదరణ తగ్గుతున్నది.

– బండి శ్రావణి, పరకాల

### నాటి సంబురం లేని పండుగ



నాటి కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న బతుకమ్మ సంబురం ఇప్పుడు లేదు. బతుకమ్మ పండుగ వస్తుందంటనే గ్రామాల్లో సందడి నెలకొనేది. వీధి దీపాల ఏర్పాటు ముందుగానే జరిగేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా జరగడం లేదు. సగం పండుగ రోజులు పూర్తయ్యాక ఇప్పుడు వీధి దీపాల ఏర్పాటు జరుగుతున్నది. చెరువులు, బతుకమ్మ ఆడే ప్రాంతాల వద్ద ఏర్పాట్లు చేస్తలేరు.

– ఆముదాలపల్లి అనురాధ, లక్ష్మీపురం

# ములుగు జిల్లాకు బతుకమ్మ చీరెలు

## మహిళా సంఘాల సభ్యులు, గిరిజన ఆడబిడ్డలకే..

- జిల్లాకు 1,05,450 కేటాయింపు
- ఇప్పటివరకు మండలాలకు చేరినవి 61,440..
- నేటి నుంచి మహిళా సంఘాల ద్వారా పంపిణీ
- మరో ఐదు గిరిజన జిల్లాల్లోనూ పంపిణీకి ప్రభుత్వం చర్యలు



వాజేడు తహసీల్‌కు లారీలో వచ్చిన బతుకమ్మ చీరెలు



ములుగు, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ప్రభుత్వ కానుకగా మహిళా సంఘాల సభ్యులు, 18 ఏళ్లు నిండిన గిరిజన మహిళలకు చీరెలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గిరిజన జిల్లాలైన ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో చీరెలను అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాలోని 355 వీవో గ్రూప్‌లు, 7,123 స్వయంసహాయక సంఘాలకు చెందిన 72,295 మంది మహిళలకు చీరెలను అందించనుండగా, ఆయా మండల కేంద్రాలకు 61,440 (85శాతం) చీరెలు చేరాయి. అదేవిధంగా జిల్లాలోని 18 ఏళ్లు నిండిన గిరిజన మహిళలకు 33,155 చీరెలను అందించనున్నారు. తాడ్వాయి, గోవిందరావుపేట మండలాలకు చెందిన బతుకమ్మ చీరెలు చల్వాయి గ్రామంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరాయి. ములుగు, వెంకటాపూర్ మండలాలకు చెందిన చీరెలు ఇంచర్ల గ్రామ శివారులోని ఎర్రిగట్టమ్మ దేవాలయం వద్ద ఉన్న ఫంక్షన్ హాల్‌కు చేరాయి. మిగిలిన అన్ని మండలాల చీరెలు ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌కు చేరాయి. వాటిని వీవో గ్రూప్‌లు, మహిళా సంఘాలకు అందజేశారు. వీటన్నింటిని ఆయా సంఘాల్లో సభ్యులైన మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా సోమవారం నుంచి పంపిణీ చేయనున్నారు.

**మహిళా సంఘాల సభ్యులకు 72,295 కేటాయింపు**

తాడ్వాయి మండలానికి 5725 మంది మహిళలకు చీరెలు రావాల్సి ఉండగా, 4870 చీరెలు మండల కేంద్రానికి చేరాయి. గోవిందరావుపేటకు 7506 మందికి 6380 చీరెలు, ములుగుకు 15933 మందికి 13540 చీరెలు, వెంకటాపూర్‌కు 8051 మందికి 6840 చీరెలు, కన్నాయిగూడేనికి 3025 మందికి 2570 చీరెలు, ఏటూరునాగారానికి 7205 మందికి 6120 చీరెలు, మంగపేటకు 12107 మందికి 10300 చీరెలు, వెంకటాపురానికి (నూగూరు) 7205 మందికి 6120 చీరెలు, వాజేడుకు మండలంలోని 5538 మందికి 4700 చీరెలు వచ్చాయి. అదేవిధంగా జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న గూడేలకు చెందిన గిరిజన మహిళల్లో 18 ఏళ్లు నిండిన మహిళలు 33155 ఉండగా, వీరికి చీరెలను ఇంకా సరఫరా చేయలేదు. బతుకమ్మ పండుగ లోపు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నేటి నుంచి మహిళా సంఘాల ద్వారా బతుకమ్మ చీరెలను పంపిణీ చేయనున్నారు.

**వాజేడు మండలానికి చేరిన 4700 చీరెలు**

వాజేడు : మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆదివారం లారీలో బతుకమ్మ చీరెలు వచ్చాయి. మండలంలోని మహిళా సంఘాల ద్వారా 4700 బతుకమ్మ చీరెలను పంపిణీ చేయనున్నట్లు గిర్దావర్ కుమారస్వామి తెలిపారు.

# అన్నాచెల్లెకు ప్రభుత్వ ఉద్యోగాలు

- తండ్రి చిన్నప్పుడే చనిపోయినా బీడీలు చుట్టి చదివించిన తల్లి
- డీఎస్సీ ర్యాంకర్లను అభినందించిన గ్రామస్తులు



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అన్నాచెల్లెతో తల్లి పద్మ

బచ్చన్నపేట, అక్టోబర్6: మండలంలోని కొన్నె గ్రామంలో అన్నాచెల్లెను ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. గ్రామానికి చెందిన బల్ల పద్మ-సోమయ్యల కుమారుడు మహేశ్‌కుమార్, కుమార్తె మౌనిక ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఎస్జీటీలో మహేశ్ 5వ ర్యాంకు, మౌనిక 15వ ర్యాంకు సాధించి గ్రామానికే వన్నె తెచ్చారు. వీరి తండ్రి చిన్నప్పుడే మృతి చెందగా, తల్లి కష్టపడి బీడీలు చుట్టి ఉన్నత చదువులు చదివించింది. అన్నాచెల్లె ఉపాధ్యాయులుగా ఎంపిక కానుండడంతో వారి తల్లి ఆనందం వ్యక్తం చేయగా, గ్రామస్తులు అభినందించారు.

# డిజిటల్ సర్వేకు ససేమిరా..

**రైతులు పండిస్తున్న పంటల సాగును డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే(డీసీఎస్) తమ వల్ల కాదని ఏఈవోలు చేతులెత్తేశారు. సిబ్బంది కొరత, తీవ్రమైన పని ఒత్తిడి వంటి కారణాలతో విముఖత చూపుతున్నారు. ఇప్పటికే తలకు మించిన భారమవుతోందని, కొత్త బాధ్యత మోయలేమని తేల్చిచెబుతున్నారు. ప్రతి వెయ్యి ఎకరాలకు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను ఇస్తే సర్వేతోపాటు ఇతర పథకాలకు సంబంధించిన పనులను సులభంగా పూర్తి చేస్తామంటున్నారు.**

*- హనుమకొండ సబర్బన్, అక్టోబర్6*

- పంటల వివరాల సేకరణకు ఏఈవోల విముఖత
- ఇప్పటికే తలకు మించిన భారం
- కొత్త బాధ్యత మోయలేమంటున్న వ్యవసాయ విస్తరణాధికారులు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి 6-8వేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించారు. ప్రస్తుతం రైతుభరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంట నష్టం సర్వేలు, ధాన్యం సేకరణ లాంటి పనులతోపాటు రుణమాఫీ కుటుంబ సర్వేలు లాంటి 49 రకాల పనులను చేస్తున్నారు. దీనికి తోడు డిజిటల్ క్రాప్ సర్వే(డీసీఎస్) చేయాలనడంతో తాము మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఏఈవోలు వాపోతున్నారు. దీనికితోడు ఏఈవోల్లో 65 శాతం మంది మహిళలే ఉండగా, దూర ప్రాంతాల్లోని పంటల వద్దకు వారు వెళ్లి క్రాప్ సర్వే చేయడం వారి భద్రతకు భరోసా లేకుండా పోతుంది. సర్వే నంబర్ల వారీగా కిలోమీటర్ల కొద్ది నడుచుకుంటూ ఫొటోలు తీయడం సాధ్యమయ్యే పనికాదని అంటున్నారు. కొన్ని సందర్భాల్లో రైతులు ఒక పంట కాలం బీడుగా ఉంచుకొని మరొక పంట కాలంలో సాగు చేస్తారు. అలాంటి సందర్భంలో రెండు సార్లు అదే పొలానికి వెళ్లడం సాధ్యమయ్యే పనికాదంటున్నారు.

**పలు రాష్ట్రాల్లో క్రాప్ సర్వేలు ఇలా..**

ఆంధ్రప్రదేశ్‌లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించి డిజిటల్ క్రాప్ సర్వే చేస్తుండగా, మహారాష్ట్రలో టాటా కంపెనీతో కలిసి ఈ-పీక్ పహాణీ పేరిట ఒక మొబైల్ యాప్‌ను తయారు చేసి రైతులతోనే పంట వివరాలను అప్‌లోడ్ చేయిస్తున్నారు. మధ్యప్రదేశ్, కర్ణాటకలో స్థానిక యువకులతో, తమిళనాడు రాష్ట్రంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్ డెయిలీ వైజ్ కూలీలతో సర్వేలు చేపట్టారు. మన రాష్ట్రంలో ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక అసిస్టెంట్ చొప్పున నియమిస్తేనే ఈ సర్వే పూర్తవుతుందని ఏఈవోలు స్పష్టం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తాము డిజిటల్ క్రాప్ సర్వే చేసే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే వారి సంఘం ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు వినతి పత్రాలు కూడా సమర్పించారు.

### ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వాలి



ప్రస్తుత పరిస్థితుల్లో మన రాష్ట్రంలో కేవలం ఏఈవోలు మాత్రమే డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించాలనడం సరికాదు. ఇప్పటికే పలు పనుల భారంతో డిజిటల్ క్రాప్ సర్వే చేయడం తలకుమించిన భారమవుతోంది. ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే బాగుంటుంది.

– రాజు, ఏఈవోల సంఘం రాష్ట్ర కోశాధికారి